సాక్షి
కుమురం భీం
సోమవారం ၊ 17 ၊ ఫిబ్రవరి ၊ 2025



ముగిసిన మైసమ్మ జాతర

గాంధారి ఖిల్లా వద్ద నిర్వహిస్తున్న మైసమ్మ జాతర ముగిసింది. ఆదివాసీ నాయక్‌పోడ్‌లు అధికసంఖ్యలో తరలివచ్చి మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. 8లో▸



ఆదర్శప్రాయుడు సేవాలాల్

సంత్ సేవాలాల్ మహరాజ్ ఆదర్శప్రాయుడని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. బాసరలో నిగోదావరి ఒడ్డున ఆదివారం సంత్ సేవాలాల్ జయంతి నిర్వహించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.2 /18.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడి ఎక్కువగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

20న 'చలో హైదరాబాద్'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆరు గ్యారంటీల అమలు కోసం ఈ నెల 20న 'చలో హైదరాబాద్' నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు వీరన్న, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. జిల్లా కేంద్రంలో నాయకులతో కలిసి ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. 14 నెలలవుతున్నా ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు బాబా, శంకర్, సురేశ్, తుకారాం, విలాస్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల హక్కులు కాపాడాలి



మాట్లాడుతున్న జడ్జి యువరాజ్

ఆసిఫాబాద్‌అర్బన్: మానసిక దివ్యాంగుల హక్కులు కాపాడాలని జిల్లా న్యాయసేవా సంస్థ అధికారి, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో లీగల్ సర్వీస్ యూనిట్ సభ్యులకు ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మానసిక అనారోగ్యం, మేథో వైకల్యం ఉన్న వ్యక్తుల హక్కులు, చట్టాలు, వారికి న్యాయ సేవలు అందించడంలో లీగల్ సర్వీస్ సభ్యుల పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

లింగాపూర్(ఆసిఫాబాద్): మండలంలోని ఎల్లాపటార్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు.

విధుల్లో నలుగురే..!

- జిల్లాలోని గ్రంథాలయాల్లో 12 పోస్టులు ఖాళీ
- 1994 తర్వాత పోస్టుల భర్తీ ఊసే లేదు..!
- ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్న వైనం
- సరిపడా సిబ్బంది లేక అవస్థలు



జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీ

వాంకిడి(ఆసిఫాబాద్): విజ్ఞానాన్ని అందించే లైబ్రరీలపై పట్టింపు కరువైంది. దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లాలో 1994లో నియామకమైన వారినే కొనసాగిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ప్రత్యేక భవనాలు లేకపోవడం.. సరిపడా సిబ్బందిని నియమించకపోవడంతో గ్రంథాలయాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. జిల్లాలోని గ్రేడ్- 1, గ్రేడ్- 2 గ్రంథాలయాల్లో మొత్తం 16 మంది ఉండాల్సి ఉండగా.. కేవలం నలుగురు సిబ్బంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ నలుగురే జిల్లాలోని తొమ్మిది గ్రంథాలయాలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లను విడుదల చేస్తుండటంతో గ్రంథాలయ సిబ్బందిని భర్తీ చేసి, పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంచితే గ్రామాల్లోని నిరుద్యోగ యువతపై ఆర్థికభారం తగ్గుతుంది.

భవనాలు కరువు..

జిల్లావ్యాప్తంగా ఉన్న తొమ్మిది గ్రంథాలయాల్లో జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీకి మాత్రమే పక్కా భవనం ఉంది. అది కూడా ఇటీవలే నిర్మించారు. అన్ని సౌకర్యాలతో నిర్మించడంతో పట్టణ పాఠకులు, నిరుద్యోగులకు అది వరంలా మారింది. మిగతా గ్రంథాలయాలకు ఇప్పటివరకు పక్కా భవనాల నిర్మాణం చేపట్టలేదు. నిధులు లేక కొన్ని, స్థలాలు లేక మరికొన్ని పక్కా భవనాలకు నోచుకోవడం లేదు. పాతబడిన ప్రభుత్వ భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగిస్తున్నారు. కొత్త మండలాల్లో గ్రంథాలయాల మంజూరు ఊసే లేకుండా పోయింది. విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి గ్రామీణ యువకులకు అందుబాటులోకి తీసుకురావాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అదనపు ఇన్‌చార్జి బాధ్యతలు చేపడుతుండటంతో సొంతంగా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది.

పట్టణాలకు వెళ్తే అదనపు భారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయి. ఉన్నత విద్యకు ప్రవేశ పరీక్షలు కూడా వేసవిలోనే ఉన్నాయి. విద్యార్థులు, యువత పోటీ పరీక్షలపై దృష్టి సారించారు. పట్టణాల్లో కోచింగ్‌లకు వెళ్తే వేల రూపాయలు అవసరం ఉంటుంది. దీంతో పేద నిరుద్యోగ యువకులు గ్రంథాలయాలనే ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటీవల జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో నిరుద్యోగులు మరింత పట్టుదలతో చదువుకుంటున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రంథాలయాల్లోనే ఉంటున్నారు. సరైన వసతులు లేకున్నా ఇన్‌చార్జీల సహకారంతో పుస్తకాలు తెప్పించుకుని సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని గ్రంథాలయాల్లో మొత్తం 74 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నిత్యం 500 నుంచి 600 మంది పాఠకులు, ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యే వారు వస్తుంటారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండటంతో అతితక్కువ మార్కులతో ఉద్యోగాలు చేజార్చుకున్న వారు, నూతనంగా ప్రిపేర్ అయ్యేవారు అధికంగా గ్రంథాలయాల బాట పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటే పేద, మధ్య తరగతికి చెందిన యువకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

సిబ్బంది కొరత..

జిల్లాలోని పాత మండలాల్లో గ్రంథాలయాలు నిర్వహిస్తున్నారు. కాగజ్‌నగర్‌లో గ్రేడ్- 2 గ్రంథాలయం ఉండగా మిగితా అన్నీ గ్రేడ్- 3 గ్రంథాలయాలే. వీటిలో పని చేసేందుకు లైబ్రేరియన్లు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు మొత్తం 16 మంది ఉండాలి. కానీ ప్రస్తుతం జిల్లాలో నలుగురు లైబ్రేరియన్లు మాత్రమే పనిచేస్తున్నారు. పాత మండలాల్లో దహెగాం, తిర్యాణి, బెజ్జూర్ మండలాలకు గ్రంథాలయాల మంజూరైనా ఇప్పటివరకు అక్కడ ప్రారంభించ లేదు. దీనికి అసలు కారణాలేంటనేది కూడా ఎవరికీ తెలియదు. ప్రస్తుతం ఉన్న తొమ్మిది గ్రంథాలయాల్లోనూ సిబ్బంది లేరు. సౌకర్యాలు కరువై పాఠకులు, నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కౌటాల, సిర్పూర్(టి), జైనూర్, సిర్పూర్(యూ), వాంకిడి మండలాల గ్రంథాలయాలు ఇన్‌చార్జీలతోనే కొనసాగుతున్నాయి. కెరమెరిలో పార్ట్‌టైం ఉద్యోగి లైబ్రేరియన్‌గా కొనసాగుతున్నారు. చివరిసారిగా 1994లో సిబ్బంది నియామకం చేపట్టారు. అప్పటి నుంచి నోటిఫికేషన్ విడుదల చేయలేదు. దశాబ్దాలుగా సిబ్బంది కొరతతో లైబ్రరీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గ్రేడ్- 2 లైబ్రేరియన్ 1, గ్రేడ్- 3 లైబ్రేరియన్లు 5, రికార్డు అసిస్టెంట్లు ఆసిఫాబాద్‌లో 1, సిర్పూర్(టి) 1, అటెండర్లు 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

గ్రంథాలయాన్ని ప్రారంభించాలి



తిర్యాణి మండలానికి గ్రంథాలయం మంజూరైనా ప్రారంభానికి నోచుకోవడం లేదు. గ్రంథాలయం అందుబాటులోకి వస్తే నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుంది. స్థానికంగా చదువుకునేందుకు సరైన వసతులు లేవు.

– మ్యాన రాజు, నిరుద్యోగి, తిర్యాణి

వసతులు కల్పించాలి



కౌటాల మండలంలో పేరుకు మాత్రమే గ్రంథాలయం ఉంది. గ్రామ పంచాయతీ భవనంలో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ లైబ్రేరియన్‌ను కేటాయించాలి. అన్నిరకాల వసతులు కల్పించాలి. బయట కోచింగ్ సెంటర్లకు వెళ్లే పరిస్థితులు లేవు.

– భారతి, నిరుద్యోగి, కౌటాల

నివేదిక పంపించాం

జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రంథాలయ పోస్టుల వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ప్రస్తుతం జిల్లాలో 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. త్వరలో ఖాళీలను భర్తీ చేసే అవకాశం ఉంది. సిబ్బందిని పూర్తిస్థాయిలో భర్తీ చేస్తే గ్రంథాలయాల నిర్వహణ బాగుంటుంది. జిల్లాలోని తొమ్మిది గ్రంథాలయాలో పోటీ పరీక్షలతోపాటు అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

– సరిత, ఇన్‌చార్జి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి

ప్రత్యేక కిట్లు.. బోధన మెరుగు



ఉపాధ్యాయులకు కిట్లు అందజేస్తున్న అధికారులు

- ప్రభుత్వ పాఠశాలలకు బోధన ఉపకరణాలు అందజేత
- వినోదంతో కూడిన విద్యనందించేందుకు చర్యలు
- విద్యా సామర్థ్యాల పెంపే లక్ష్యం..

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే మండలాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో మోడల్ లైబ్రరీలు ఏర్పాటు చేశారు. అలాగే విడతల వారీగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)లు పంపిణీ చేసి 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. తాజాగా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా బోధించేందుకు సర్కారు బడులకు ప్రత్యేక కిట్లు అందజేస్తున్నారు. బడుల్లో వినోదంతో కూడిన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేకంగా కిట్లు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఇప్పటికే తొలిమెట్టు, ఉన్నత పాఠశాలలో ఉన్నతి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. అయినా విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో సామర్థ్యాలు మెరుగుపడటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో ఐటీసీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక బోధన ఉపకరణాల కిట్లను ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేశారు. ఇటీవల ఉపాధ్యాయులకు కిట్లపై అవగాహన కల్పించి కిట్లు అందించారు. సాధారణ తరగతి బోధనతో విద్యార్థులు విసుగు చెందే అవకాశం ఉంది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఎఫ్ఎల్ఎం కింద వండర్ బాక్సులు, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు గణిత, సైన్స్ కిట్లు పంపిణీ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎఫ్ఎల్ఎస్ వండర్ బాక్సుల్లో ప్రధానంగా కథలు పొందుపరిచారు. పరికరాలు చూపుతూ బోధిస్తుండటంతో విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయి.

పాఠశాలలకు కిట్లు సరఫరా

జిల్లావ్యాప్తంగా డీఈవో పరిధిలోని 702 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 2024- 25 విద్యా సంవత్సరంలో 38 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. డీఈవో పరిధిలో ఉన్న 702 పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువ మంది ఉన్న వాటికి మొదట ప్రాధాన్యం ఇచ్చారు. మొదటి విడతలో భాగంగా 105 ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎఫ్ఎల్ఎస్ వండర్ బాక్సులు, 15కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ)కు గణిత, సైన్స్ క్యూరియాసిటీ బాక్సులు సరఫరా చేశారు. 11 ఉన్నత పాఠశాలలకు 11 ఖోజీ కిట్లు అందజేయగా, వీటిల్లో గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించిన పరికరాలు ఉన్నాయి. ఉపాధ్యాయులు ఆయా పరికరాలకు సమర్థవంతంగా వినియోగించుకుని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

సమర్థవంతంగా వినియోగించాలి



విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మొదట ఎంపిక చేసిన పాఠశాలలకు ప్రత్యేక కిట్లు అందించాం. వండర్ బాక్స్‌లను ఉపాధ్యాయులు సమర్థవంతంగా వినియోగించాలి. వీటిని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలి. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు కృషి చేయాలి.

– శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్టు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్: పదో తరగతి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాన్ని వెలికితీసేందుకు జిల్లావ్యాప్తంగా ఆదివారం టాలెంట్ టెస్టు నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి సాయికృష్ణ తెలిపారు. జిల్లా కేంద్రంలో వారు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా నాలుగు వేల మంది విద్యార్థులు టాలెంట్ టెస్టుకు హాజరయ్యారని తెలిపారు. ఫలితాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ప్రతిభ చూపిన వారికి జిల్లా, మండల స్థాయిలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కార్యదర్శి కార్తీక్, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చంద్రశేఖర్ తదతరులు పాల్గొన్నారు.

శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- అట్టహాసంగా పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్: సరస్వతి శిశుమందిరాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, శిశుమందిర్ విద్యాపీఠం దక్షిణ మధ్య క్షేత్రం సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1979 నుంచి 2024 వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా నాలుగు దశాబ్దాల తర్వాత ఒకచోట చేరారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముందుగా ఆచార్యులకు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శిశుమందిరాలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యనందిస్తున్నాయమన్నారు. తెలుగు భాషకు పూర్వవైభవం తేవాలని ఆకాంక్షించారు. కాగా అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థి గోపికృష్ణ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా స్వదేశానికి వచ్చారు. వేదికపై చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, పాఠశాల విద్యార్థి పరిషత్ నాయకులు శ్రీనివాస్, రాజరెడ్డి, పాఠశాల అధ్యక్షులు చిలువేరు వెంకన్న, విష్ణువర్ధన్, ప్రథమ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ప్రతినిధులు బోనగిరి సతీశ్‌బాబు, ప్రధానాచార్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం

- ఏడాదిలోనే 53 వేల ఉద్యోగాలిచ్చాం
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన నరేందర్‌రెడ్డి

భైంసాటౌన్/నిర్మల్‌రూరల్/కైలాస్‌నగర్: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో లక్ష మంది నిరుద్యోగులకు కూడా ఉద్యోగావకాశాలు కల్పించలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 53 వేల ఉద్యోగాలు ఇచ్చిందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భైంసా పట్టణం, నిర్మల్ మండలం కొండాపూర్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో వేర్వేరుగా ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ ప్రమోషన్లు, బదిలీల సమస్య పరిష్కరించామని చెప్పారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మతతత్వ బీజేపీ ఉచ్చులో పడి నిరుద్యోగులు మోసపోవద్దని సూచించారు. దేవుడు వేరు, రాజకీయం వేరని అన్నారు. బీజేపీ దేవుడిపై, కుల మతాల మీదా రాజకీయం చేస్తుందన్నారు. మోదీ బీసీ కాదన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కొందరు బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ కులమేంటని అడుగుతున్నారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా వూట్కూరి నరేందర్‌రెడ్డికి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బూత్‌లవారీగా ఓటర్లను కలిసి కాంగ్రెస్ విజయానికి పనిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే ప్రైవేట్ టీచర్లందరికీ రూ.3 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీగా కొనసాగినంత కాలం తానే ప్రీమియం చెల్లిస్తానని చెప్పారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లు, అధ్యాపకులకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి హెల్త్ కార్డులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. గ్రంథాలయాలు ఏర్పాటు చేయడంతోపాటు వాటి ఆధునీకీకరణకు కృషి చేస్తానని చెప్పారు. లైబ్రరీల్లో పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం అందించే విధంగా సీఎంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. భైంసా నియోజకవర్గంలో ఐటీఐ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, రాష్ట్ర విత్తన సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, , నిర్మల్, సారంగపూర్ ఏఎంసీల చైర్మన్లు భీమ్‌రెడ్డి, అబ్దుల్ అతిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టంభన తొలగేదెన్నడో..

- ఐదేళ్ల క్రితం నిలిచిన సింగరేణి సీఎండీ స్థాయి సమావేశాలు
- పరిష్కారానికి నోచుకోని కార్మికుల ప్రధాన సమస్యలు
- పిలుపు కోసం గుర్తింపు సంఘం ఎదురుచూపు



ఇటీవల డైరెక్టర్(పా)స్థాయి స్ట్రక్చరల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

శ్రీరాంపూర్: తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిలో సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశాలపై ప్రతిష్టంభన నెలకొంది. ప్రధాన డిమాండ్ సాధనకు వేదిక అయిన ఈ సమావేశం ఐదేళ్లుగా నిర్వహించడం లేదు. గత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ హయాం నుంచి ఈ సమావేశాలకు బ్రేక్ పడింది. నాడు ప్రభుత్వ పెద్దలే నిర్ణయాలు తీసుకునేవారు. ప్రధాన డిమాండ్లు కూడా వారే పరిష్కరించేవారు. దీంతో సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశానికి ప్రాధాన్యం తగ్గింది. దీనిని నిర్వహించాల్సిన అవసరం కూడా లేకుండా పోయింది. గతేడాది గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన ఏఐటీయూసీ అన్ని స్థాయిల్లో స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. దీంతో యాజమాన్యం ఏరియాల వారీగా జీఎం లెవల్ స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహిస్తోంది. 2024 నవంబర్ 28న డైరెక్టర్(పా) లెవల్ స్ట్రక్చరల్ సమావేశం కూడా జరిగింది. ఇందులో కొన్ని డిమాండ్లపై అంగీకారం కుదిరినా అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రధానమైన డిమాండ్లను సీఎండీ లెవల్ స్ట్రక్చరల్ సమావేశంలో చర్చించాల్సి ఉంది. ఈ సమావేశం ఏర్పాటు చేస్తే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోరాలని గుర్తింపు సంఘం నాయకులు భావిస్తున్నారు. కానీ యాజమాన్యం మాత్రం సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశం నిర్వహణకు ఆసక్తి చూపడం లేదు.

ప్రధాన డిమాండ్లు...

కార్మికులకు కోలిండియాలో మాదిరిగా పెర్క్స్‌పై ఆదాయ పన్నును యాజమాన్యమే చెల్లించాలనే డిమాండ్ చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. కార్మికుల సొంత ఇంటి పథకం, మారు పేర్లతో పనిచేసే వారి పేర్లను క్రమబద్ధీకరించాలన్న డిమాండ్ పరిష్కారం కావడం లేదు. గైర్హాజరు పేరుతో డిస్మిస్ చేసిన వారికి మరో అవకాశం కల్పిస్తూ తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని, ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి పనులు కాంట్రాక్టర్లతో కాకుండా కంపెనే చేపట్టాలని, కాంట్రాక్ట్ కార్మికులకు జీవో 22 అమలు చేసి వేతనాలు చెల్లించాలని, కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను అమలు చేయాలనే ప్రధాన డిమాండ్లను సీఎండీ లెవల్ స్ట్రక్చరల్ సమావేశాల్లో చర్చించి పరిష్కరించుకోవాల్సి ఉందని ఏఐటీయూసీ నేతలు పేర్కొంటున్నారు.

కోడ్ కారణమా..?

డైరెక్టర్(పా) లెవల్ సమావేశం జరిగిన నెలకే సీఎండీ లెవల్ సమావేశం విధిగా జరగాల్సి ఉంది. కానీ కంపెనీ నిర్వహించడం లేదు. ఇప్పటికీ మూడు సార్లు సీఎండీ లెవల్ సమావేశాలు పెట్టడానికి అధికారులు నిర్ణయించి రద్దు చేశారు. చివరికి ఈ నెల మొదటి వారంలో ఉంటుందని భావించారు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సమావేశం మరోమారు వాయిదా వేసినట్లు తెలిసింది. ఇన్నాళ్లు సమావేశం నిర్వహించకుండా.. ఇప్పుడు కోడ్ పేరుతో కావాలనే అధికారులు జాప్యం చేస్తున్నారని గుర్తింపు కార్మిక సంఘం నేతలు పేర్కొంటున్నారు.

కోడ్ సాకుతో కావాలనే జాప్యం

ఎన్నికల కోడ్‌కు సింగరేణి స్ట్రక్చరల్ సమావేశాలకు సంబంధం లేదు. 25 ఏళ్ల నుంచి సింగరేణిలో స్ట్రక్చరల్ సమావేశాలు జరుగుతున్నా ఏనాడు ఎన్నికల కోడ్‌తో సమావేశాలు ఆపలేదు. ఇప్పుడు యాజమాన్యం కావాలనే జాప్యం చేస్తోంది. రెగ్యులర్ ప్రాసెస్‌గా జరిగే ఈ సమావేశాలకు కోడ్ అడ్డంకి కాదు. సత్వరమే సీఎండీ లెవల్ స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ప్రధాన డిమాండ్లు నెరవేర్చాలి.

–వి.సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌అర్బన్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రతిభా కళాశాలలో 2025- 26 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. పీటీజీ గిరిజన గురుకులంలో 320 మంది విద్యార్థులకు 300 మంది, గిరిజన బాలికల కళాశాలలో 245 మందికి 221 మంది, గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో 320 మందికి 306 మంది హాజరయ్యారని ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు కారం భద్రయ్య, అనిత వెల్లడించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామని వారు వివరించారు. పీటీజీ గురుకులంలో అబ్జర్వర్‌గా తిర్యాణి కళాశాల అధ్యాపకురాలు సౌమ్య వ్యవహరించారు.

క్లుప్తంగా

సిమెంట్ ఇటుకతో కొట్టి..

- భార్యను హత్య చేసిన భర్త
- లక్సెట్టిపేటలో ఘటన



రాజకుమారి (ఫైల్)

లక్సెట్టిపేట: సిమెంట్ ఇటుకతో కొట్టి భార్యను హత్య చేసిన ఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గోదావరి రోడ్డు వికార్స్ కాలనీకి చెందిన లాకవత్ రాజకుమారి (40), గణేశ్ భార్యాభర్తలు. భర్త తాగుడుకు బానిసై ఎలాంటి పనులు చేయకుండా తిరుగుతూ ఉండేవాడు. నిత్యం మద్యం తాగి వచ్చి భార్యకు వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో వేధించసాగాడు. ఆదివారం ఉదయం రాజకుమారి బాత్రూమ్‌కు వెళ్లగా, వెనుకాల వెళ్లి సిమెంట్ ఇటుకతో ఆమె తలపై కొట్టడంతో తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లి రేణుకబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కారు బోల్తా: ఒకరి మృతి



బోల్తాపడ్డ కారు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమరవాది హైవేపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగి పూదరి ఓంకార్(32) మరో ఇద్దరు రాము, సంజయ్‌లు కారులో మందమర్రి వైపు వస్తున్నారు. అమరవాది హైవేపై కారు అదుపు తప్పి హైవే రైలింగ్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో ఓంకార్ అక్కడికక్కడే మృతిచెందగా రాము, సంజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బట్వాన్‌పల్లిలో ఇడిగిరాల భీమయ్యకు చెందిన పెంకుటిల్లు ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. రెండు తులాల బంగారం, రూ.80 వేల నగదుతోపాటు భీమయ్య కుమారుడు మహేశ్‌కు సంబంధించిన విద్యా అర్హత ధ్రువీకరణపత్రాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న బెల్లంపల్లి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కూలీ పనిచేసుకునే తనకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితుడు భీమయ్య కోరాడు.



జాతరలో ఆదివాసీల నృత్యం



మొక్కులు చెల్లించేందుకు బారులు తీరిన భక్తులు



మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ముగిసిన మైసమ్మ జాతర

- చివరిరోజు జనసంద్రంగా గాంధారి ఖిల్లా
- తరలివచ్చిన ఆదివాసీలు
- దర్బార్‌లో పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



మైసమ్మకు పూలదండతో అలంకరణ



భైరవుడి విగ్రహం వద్ద మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట గాంధారీ ఖిల్లా వద్ద మూడురోజులుగా నిర్వహిస్తున్న మైసమ్మ జాతర ఆదివారం ముగిసింది. ఆదివాసీ నాయక్‌పోడ్‌లు అధికసంఖ్యలో తరలివచ్చి మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివాసీలు సంప్రదాయ తప్పెటగూళ్ల ఆటలు, డప్పుచప్పుళ్లతో చేరుకుని అక్కడ గిరిజనులు తీసుకువచ్చిన గంగాజలంతో దేవతామూర్తులను శుద్ధి చేసి పట్నాలు వేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కోళ్లు, మేకలు బలిచ్చారు. ఆదివాసీలు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి ఆదివాసీలు, భక్తులు తరలిరావడంతో గాంధారీ ఖిల్లా ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.

ఆదివాసీలకు ప్రత్యేక భవనం: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

ఆదివాసీల కోసం ప్రత్యేక భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం నిర్వహించిన దర్బార్‌కు ఆయన హాజరై మాట్లాడారు. భవనం ఏర్పాటుకు రెండు మూడు స్థలాలను పరిశీలించాలని నాయక్‌పోడ్ సంఘ నాయకులకు సూచించారు. భవనం కోసం స్థలంతోపాటు రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తానన్నారు. గాంధారి ఖిల్లాను మరింతగా అభివృద్ధి చేయాలంటే అటవీశాఖ అనుమతులు తప్పనిసరని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కుల కోసం సంఘం నాయకులంతా ఓ కమిటీగా ఏర్పడి వస్తే సీఎంను కలిసి తద్వారా ఆదివాసీల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో వందలాది కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో జాతర వేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంప్రదాయ నృత్యాలు, తప్పెటగూళ్ల ఆటలు, లక్ష్మీదేవర నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్యాతనపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, నాయక్‌పోడ్ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సేవాలాల్



హాజరైన మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

- రాష్ట్ర మంత్రి సీతక్క



పాల్గొన్న బంజారా సేవాలాల్ భక్తులు

బాసర: సంత్ సేవాలాల్ మహరాజ్ ఆదర్శప్రాయుడని, ఆయన అడుగుజాడల్లో నడవాలని రాష్ట్రమంత్రి సీతక్క పేర్కొన్నారు. బాసరలోని గోదావరి నది ఒడ్డున శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం 286వ సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి పొరగాడ్ పీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్, దీక్షగురు ప్రేమ్‌సింగ్ మహరాజ్, ఎంపీ నగేశ్, ముథోల్, నిర్మల్, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి, వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బంజారా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాసరలో సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని తెలిపారు. లంబడా, బంజారా నాయకుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం తరఫున సేవాలాల్ సంస్థాన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. బంజారాల కోసం బాసరలో ఐదెకరాల భూమి కేటాయించే వరకు పోరాడతానని ఎమ్మెల్యే రామారావుపటేల్ తెలిపారు. బాసరలో సేవాలాల్ మహరాజ్ మందిరం నిర్మిస్తామన్నారు. 15 వేల మందికి అన్నదానం చేసిన ఎమ్మెల్యేకు సేవాలాల్ సంస్థాన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ హిందూధర్మం గొప్పతనాన్ని బంజారాలకు తెలియజేసిన మహోన్నత వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. అనంతరం బంజారా నాట్యమండలి, పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బాసరలో భక్తుల కిటకిట



క్యూలైన్‌లో భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసర: బాసర ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలువులు రావడంతో అధికసంఖ్యలో తరలివచ్చారు. మాఘశుద్ధ సంకట చతుర్థి శుభముహూర్తం సందర్భంగా జిల్లా నుంచే కాక ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చి పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతీ, మహాంకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు అర్చకులతో అక్షర శ్రీకారం పూజలు చేయించారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

- ఒకరు మృతి



చుక్కయ్య (ఫైల్)

రెబ్బెన: రాంగ్‌రూట్‌లో వచ్చి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టిన ఘటన మండలంలోని నవేగాం బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై డి.చంద్రశేఖర్ కథ నం ప్రకారం.. మండలంలోని గంగాపూర్‌కు చెంది న నగోషా చుక్కయ్య (37), భార్య మాధవితో కలి సి ఆదివారం బైక్‌పై కాగజ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలోని నవేగాం బస్టాండ్ దాటగా రాళ్లపేటకు చెందిన కుక్కల ల క్ష్మణ్ ఎదురుగా రాంగ్‌రూట్‌లో బైక్ నడుపుకుంటూ వచ్చి చుక్కయ్య బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చుక్కయ్యకు తీవ్రంగా, మాధవి గాయాలయ్యా యి. చుక్కయ్యకు రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకోగా వీరి బంధువు శ్రీకాంత్ వెంటనే 108కు సమాచారం అందించాడు. సిబ్బంది అక్కడికి చేరుకుని ఇద్దరిని కాగజ్‌నగర్‌కు తరలించారు. చుక్కయ్యను వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి



మల్లేశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ సమీపంలో జాతీయ రహదారి 44పై బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై కె.మహేందర్, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా కలాంబి గ్రామానికి చెందిన నివారే జ్ఞానేశ్వర్ (56) గత కొంతకాలంగా బోథ్‌లోని ఓ ప్రైవేటు జిన్నింగ్ మిల్లులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం తన స్వగ్రామమైన కలాంబి గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. శర్మదాబా సమీపంలో వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం అతివేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై సుమలత తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని మల్లాపూర్‌కు చెందిన రేణి మల్లేశ్ (56) శనివారం రాత్రి పని నిమిత్తం బైక్‌పై లక్ష్మణచాందకు వెళ్లి తిరుగుపయనమయ్యాడు. ఈక్రమంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్ రోడ్డు పక్కనే ఉన్న పంట పొలంలో పడి మృతిచెందాడు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుమలత ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరేసుకుని టీచర్ ఆత్మహత్య



సంతోష్ నాయక్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన టీచర్ సంతోష్‌నాయక్ (28) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. సంతోష్‌నాయక్ జైనూర్ మండలం జామ్నిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు పని నిమిత్తం నిర్మల్‌కు వెళ్లారు. ఇంట్లో ఆయన సోదరి ఉన్నారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో సోదరి ఆయన్ను నిద్ర నుంచి లేపే ప్రయత్నం చేయగా మేల్కొలేదు. దీంతో ఆమె వెంటనే ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు చెప్పింది. వారు మధ్యాహ్నం వచ్చి చూసేసరికి ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బేల: మండలంలోని కాంఘర్‌పూర్ రెవెన్యూ గ్రామశివారులోని పెనగంగ నుంచి ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ తెలిపారు. సమాచారం మేరకు పెన్‌గంగ శివారులో ఏఎస్సైలు లింగన్న, జీవన్‌కుమార్ తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

పిచ్చికుక్కదాడిలో ఒకరికి గాయాలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఆరేవాడలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మానేపల్లి సత్యనారాయణ..విందు కార్యక్రమానికి వెళ్లి తిరిగివస్తుండగా పిచ్చికుక్క దాడిలో కుడి కాలికి గాయమైంది. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాడు.



పెయింటెడ్ స్టార్క్స్ పక్షులు



బాతుజాతి పక్షులు


అరుదైన పక్షులకు ఆలవాలం

కాగజ్‌నగర్ డివిజనల్ అరుదైన పక్షులకు ఆలవాలంగా మారింది. ఇక్కడ ఎన్నో జాతులు మనుగడ సాగిస్తున్నాయి. గతనెలలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఇక్కడ బర్డ్‌వాక్ ఫెస్టివల్ విజయవంతంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పక్షి ప్రేమికులు సిర్పూర్(టి), బెజ్జూర్, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ రేంజ్‌ల్లో పర్యటించారు. అటవీప్రాంతంలో స్వేచ్ఛగా సంచరిస్తున్న అందమైన పక్షులను గుర్తించి తమ కెమెరాల్లో బంధించారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 240 వరకు పక్షి జాతులు ఉన్నాయని సిర్పూర్(టి) రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు.

– సిర్పూర్(టి)



అరుదైన పక్షి



కాగజ్‌నగర్ డివిజన్‌లో అరుదైన పక్షులు



స్మాల్ ఇండియన్ ప్యాంటికోల్స్



బ్రాహ్మిణి డక్స్



బార్‌హెడెడ్ గూస్ పక్షులు

బెల్లంపల్లి డివిజన్‌లోనే బెబ్బులి

- తాండూర్–బెల్లంపల్లి మధ్య సంచారం
- కదలికలను పర్యవేక్షిస్తున్న అటవీ అధికారులు
- ఆందోళన చెందుతున్న గ్రామీణ ప్రజలు



అచ్చులాపూర్ అటవీ ప్రాంతంలో గుర్తించిన పులి పాదముద్రలు

బెల్లంపల్లి: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి బెల్లంపల్లి డివిజన్‌లోకి వచ్చిన బెబ్బులు.. పక్షం రోజులుగా ఇక్కడే మకాం వేసింది. బెల్లంపల్లి, తాండూర్ మండలాల పరిధిలోనే రోజుకో గ్రామంలో దాని పాదముద్రలు కనిపిస్తున్నాయి. దీంతో ఇటు అటవీ అధికారులకు, అటు అటవీ గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. అటవీ అధికారులు నిత్యం పులి కదలికలను పర్యవేక్షిస్తున్నారు. పులికి ఆపద రాకుండా చూసుకుంటున్నారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి అటవీ ప్రాంతం నుంచి జిల్లాలోకి వచ్చిన పులి బెల్లంపల్లి మండలం కన్నాల అటవీ ప్రాంతం, కాసిపేట మండలంలోని అటవీ ప్రాంతాల్లో సంచరిస్తోంది. ఓ అడవి పందిపైదాడి చేసింది. తర్వాత తాండూర్ మండలం అంకుశం, మాదారం, రేపల్లెవాడ అటవీ ప్రాంతాల మీదుగా రెబ్బెన మండలం పులిమడుగు అటవీ ప్రాంతాల్లో సంచరించింది. తర్వాత తక్కళ్లపల్లి గ్రామశివారు అటవీ ప్రాంతం నుంచి తాండూర్ మండలం గోపాల్‌నగర్ శివారులో ప్రత్యక్షమైంది. అక్కడ ఉన్న ఓ మంచినీళ్ల బావివద్ద గ్రామీణులు పులి అడుగులను చూసి ఆందోళన చెందారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించడంతో తక్షణమే స్పందించిన వారు సంరక్షణ చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం పులి పాదముద్రలను అచ్చులాపూర్ గ్రామం ప్రజలకు కనిపించాయి. గ్రామం నుంచి సమీపంలో ఉన్న అడవిలోకి వెళ్లినట్లు అటవీ అధికారులు గుర్తించారు. బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామ పరిసరాల్లో పాద ముద్రలు కనిపించాయి. పులి కదలికలను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది చర్లపల్లి గ్రామంలో పర్యటించారు. పాదముద్రల ఆధారంగా పులి సంచారాన్ని ధ్రువీకరించారు. అచ్చులాపూర్, గోపాల్‌నగర్, చంద్రవెల్లి, చర్లపల్లి తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాని సూచించారు. ఒంటరిగా అటవీ ప్రాంతానికి వెళ్లొద్దని తెలిపారు. పులికి ఆపద తలపెట్టొద్దని పేర్కొన్నారు.

మూడు దశాబ్దాల తర్వాత..



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 1993–96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత ఒకచోట కలిసిన వీరు ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కళాశాలలో చదివి ఉన్నత శ్రేణిలో స్థిరపడిన బోయ తిరుపతి (జిల్లా జడ్జి), కె.వేణుగోపాలస్వామి (డీఎంఎస్), కరీముల్లాఖాన్ (సాఫ్ట్‌వేర్ కంపెనీ డెలివరీ మేనేజర్), శ్రీరామ్ (డెల్ కంపెనీ మేనేజర్)ను సన్మానించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా కప్పి సత్కరించారు. ఒక్కో బ్రాంచ్ పూర్వవిద్యార్థులు కళాశాల హాస్టల్ ముందు మొక్కను నాటారు. ప్రిన్సిపాల్ దేవేందర్, మైనింగ్, ఈఐ, ఈఈఈ బ్రాంచిల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.